నేడు చండీహోమం

సనత్‌నగర్: ఫాల్గుణ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీదుర్గామాత అమ్మవారికి సోమవారం ఉదయం 8 గంటలకు చండీ హోమం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. అలాగే శ్రీదత్తాత్రేయస్వామి వారికి ఉదయం 6 గంటలకు అభిషేకం, ఉదయం 10 గంటలకు దత్తహోమం, తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వైభవంగా చండీహోమం


చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి నెల పౌర్ణమి రోజు చండీహోమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

300 గజాల ఇల్లు ఉంటే..
ఇంకుడుగుంత తప్పనిసరి

- సర్వే చేపట్టిన జల మండలి సిబ్బంది
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బృందాలు
- ఇంకుడుగుంత లేకుంటే తగిన చర్యలు
- ముందు అవగాహన.. తర్వాత జరిమానా..

బంజారాహిల్స్: వేసవిలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోతోంది. ఇప్పుడే ఇలా ఉంటే నిండు వేసవిలో ఎలా ఉంటుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఎండల తీవ్రత నేపథ్యంలో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్‌వెల్స్‌లో నీరు ఇంకిపోయి ప్రజలు ఎక్కువ శాతం జలమండలి సరఫరా చేస్తున్న నీటినే వినియోగించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వేసవి తీవ్రతకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని జలమండలి గుర్తించింది. ఇటీవలే హైకోర్టు ఇంకుడుగుంతలపై సీరియస్‌గా వ్యాఖ్యలు చేసి వీటిని ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో జలమండలి ఉన్నతాధికారులు ఇందు కోసం ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలని సెక్షన్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసింది.

- జలమండలి–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, తట్టిఖానా, ఎర్రగడ్డ, ఎల్లారెడ్డిగూడ, ఫతేనగర్, ఎస్‌ఆర్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, సోమాజిగూడ, వెంగళరావునగర్ తదితర 12 జలమండలి సెక్షన్ల పరిధిలో 300 గజాల స్థలంలో ఇళ్లు ఉంటే ఆ ఇంటికి తప్పనిసరిగా 2012 జీహెచ్‌ఎంసీ బిల్డింగ్ రూల్స్ చట్టం ప్రకారం ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలి. అయితే చాలా నివాసాల్లో, అపార్ట్‌మెంట్లలో ఇంకుడుగుంతలు పనిచేయడం లేదు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకుంటే వేసవిలో నీళ్ల సమస్య ఉండదని భావించిన అధికారులు ఆ మేరకు ఇంకుడు గుంతలపై దృష్టిసారించారు. గత రెండు రోజులుగా 300 గజాల ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 12 బృందాలు రంగంలోకి దిగాయి.


నీటి పంపిణీ వ్యవస్థను పరిశీలిస్తున్న జలమండలి సిబ్బంది

- వీరు ప్రతి ఇంటిని సందర్శించి అక్కడ ఇంకుడుగుంత ఉందో లేదో చూస్తారు.
- లేకపోతే ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సూచిస్తారు.
- ఇంకుడుగుంత ఉండీ పనిచేయకపోతే వారికి అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- ఆ ఇంకుడుగుంతకు సంబంధించి ఫొటోను తీసుకుని వారికి ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.
- ఇంకుడుగుంతకు మరమ్మతులు చేపట్టి వచ్చే వర్షాకాలంలో నీళ్లు వృథాపోకుండా చూసుకునేలా అవగాహన కలిగించి నీటి ప్రాధాన్యతను తెలియజేస్తారు.


ఇంకుడు గుంతల వివరాలు సేకరిస్తున్న జలమండలి సిబ్బంది

- తాము చెప్పిన తర్వాత కూడా ఇంకుడుగుంత ఏర్పాటు చేయకున్నా, అప్పటికే ఉంటే దానిని వినియోగంలోకి తేకున్నా వారికి నోటీసులు జారీ చేస్తారు.
- నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా స్పందించకుంటే జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి సంబంధిత యజమానికి జరిమానా విధిస్తారు. జరిమానా విధించినా ఇంకుడుగుంత వినియోగంలోకి తీసుకురాకుంటే వారి నల్లా కనెక్షన్‌ను కట్ చేయడానికి వెనుకాడరు.
- ఇలా ఇంకుడుగుంతలపై జలమండలి అధికారులు ఫోకస్ పెట్టి 300 గజాల స్థలంలో ఇళ్లు కట్టిన ప్రతిఒక్కరికీ ఈ వానకాలం నాటికి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నీటి సరఫరాపై నిరంతర తనిఖీలు..

వేసవి మూడు నెలల పాటు రోజూ జీఎం, డీజీఎం, మేనేజర్లు, లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరా వేళల్లో పర్యటించి మంచినీటి సరఫరాను తెలుసుకోవాలి. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి. జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధి కిందికి వచ్చే 12 సెక్షన్ల పరిధిలో ఉన్న 90 వేల డొమెస్టిక్ కనెక్షన్లను ఈ మూడు నెలల పాటు రోజూ సంబంధిత అధికారులు పర్యటించి నీటి సరఫరాను సమీక్షిస్తారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఈ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

తన అభ్యర్థిత్వం పరిశీలించండి


ఈటల రాజేందర్‌కు బయోడేటా అందజేస్తున్న విజయరామ రాజు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ బీజేపీ టికెట్‌ను తనకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యేలు రామారావు, మంకమ్మ దంపతుల తనయుడు విజయరామ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా కోరుతూ బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విజయరామ రాజు మాట్లాడుతూ.. నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారాక తొలి ఎమ్మెల్యేగా తన తండ్రి రామారావు గెలిచారని అనంతరం తన తల్లి మంకమ్మ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. నిస్వార్థ నాయకులు వారసుడిగా తనకూ ఓ అవకాశం కల్పించాలన్నారు.

నియామకం

సనత్‌నగర్: యూత్ కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా బేగంపేట భగవంతాపూర్‌కు చెందిన దర్గా మురళి నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్, సనత్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు ప్రియాంక ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దర్గా మురళి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యూత్ విభాగాన్ని పటిష్టం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజారంజకంగా పాలన సాగిస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్కువ కాలంలోనే అమలు చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి యూత్ కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు.

యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్..


మారుతి గౌడ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మారుతి గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మోత రోహిత్, మారుతి గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మారుతి గౌడ్ మాట్లాడుతూ.. ఎన్ఎస్‌యూఐ ద్వారా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన తాను అంచెలంచెలుగా యువజన కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎదగడంలో పార్టీ పెద్దల సహకారం ఎంతో ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

అడ్డగుట్ట: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా కథనం ప్రకారం.. తార్నాకలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి గణేష్ టెంపుల్ వైపు శనివారం మధ్య రాత్రి సుమారు 50–55 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా ఒక్కసారిగా బస్సు రావడంతో గమనించిన వృద్ధురాలు వెనుకకు జరిగింది. ప్రమాదవశాత్తు కాలు జారడంతో తల రోడ్డుకు గట్టిగా తగిలి తీవ్రగాయమైంది. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


ప్రవీణ్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: మద్యం దుకాణానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన ప్రవీణ్‌యాదవ్ (28), రంజుదేవి భార్యాభర్తలు, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి ఓల్డ్ గాస్మండిలో ఉంటున్నారు. ప్రవీణ్ యాదవ్ ఇదే ప్రాంతంలో ఉండే రాజ్ స్పేర్స్ అనే హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన ప్రవీణ్ యాదవ్ రాత్రి వైన్ షాపునకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పి వెళ్లి ఎంతకీ రాలేదు. తెలిసినవారు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పీసీఓఎస్ మెటబాలిక్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ గెరార్డ్ కాన్వే

రాంగోపాల్‌పేట్: మహిళలు, యువతుల్లో కనిపించే పీసీఓఎస్ మెటబాలిక్ సిండ్రోమ్‌పై అవగాహన కల్పించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపించవచ్చని యూనివర్సిటీ ఆఫ్ లండన్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు ప్రొఫెసర్ గెరార్డ్ కాన్వే, డాక్టర్ ఎఫియా యాసిన్ సూచించారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం మెటబాలిక్ సిండ్రోమ్ ఇన్ పీసీఓఎస్ అనే అంశంపై పీసీఓఎస్ సొసైటీ, కిమ్స్ ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడారు. యువత, మహిళల్లో ముఖం మీద వచ్చే మొటిమలు, అవాంచిత రోమాలు, రుతుక్రమం సరిగా లేదని, గర్భం రావడం లేదని వైద్యుల వద్దకు వెళ్తుంతుంటారని వైద్యులు వారికి రోగాన్ని తగ్గించేందుకు మందులు ఇస్తారని అయితే వీరిలో సాధారణంగా ఉండే పాలీసిస్టిక్ ఓవరీస్ సిండ్రోమ్‌ను గుర్తించి వైద్యం అందించగలిగితే బాగుంటుందని సూచించారు. ఈ సదస్సులో వైద్యులు శశాంక్ ఆర్ జోషీ, కాంతి బన్సల్, శోభనా పటేల్, ప్రసూన్ దేవ్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి


కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరితో సమావేశమైన రజని, మౌనిక

సనత్‌నగర్: మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా సమిష్టిగా కృషి చేయాలని లక్ష్మారెడ్డి సతీమణి రజని, కుమార్తె మౌనిక విజ్ఞప్తి చేశారు. బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరిని ఆదివారం ఆమె నివాసంలో కలిసి లక్ష్మారెడ్డి గెలుపులో భాగస్వాములుగా కావాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉండే లక్ష్మారెడ్డి గెలుపు ద్వారా మల్కాజిగిరి అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కృష్ణారావు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం జరిగిందని, అదే తరహా లక్ష్మారెడ్డి గెలుపునకు అందరం కలసికట్టుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలోనే పార్టీలకతీతంగా మల్కాజిగిరి అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, నరేష్, రఘునాథ్, రాజయ్య, సత్యనారాయణ, పాండు, పేపర్ శ్రీను, సుధాకర్, శ్రీనివాస్, సునీత, సువర్ణ, శ్రీదేవి, ఉషాలక్ష్మీ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి


మెమొంటోను అందజేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పద్మారావునగర్: భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత సమాజహితం కోసం పనిచేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆదయ్యనగర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం కోసం ఎంతో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. యువత మహనీయుల జీవిత చరిత్రను చదివి స్ఫూర్తి పొందాలని కోరారు. రక్తదానం మరొకరికి ప్రాణదానమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలపై యువత అవగాహన పెంచుకొని సమాజహితం కోసం పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మెమొంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగులు, హరిక్రిష్ణ, తలసాని సైకిలాబ్, రాములు, జయరాజ్, నరేస్, శివ, ప్రమోద్, చరణ్, రోహన్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే మాదిగల రాజకీయ ఎజెండా


మాట్లాడుతున్న గోవింద్ నరేష్ మాదిగ

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణే మాదిగల రాజకీయ ఎజెండాతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ అన్నారు. ఆదివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో మాచర్ల ప్రభాకర్ మాదిగ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో గోవింద్ నరేష్ మాదిగ హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమన్నారు. రాజకీయ పార్టీలు మాదిగల ఓట్ల కోసం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని లేవనెత్తుతూ ఆచరణలో మోసం చేస్తున్నాయని మండి పడ్డారు. సుమారు 30 సంవత్సరాల నుంచి మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ చిత్తశుద్ధితో అనేక ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహించిందని గుర్తు చేశారు. కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఓ స్పష్టమైన విధానం, వైఖరితో ముందుకు సాగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం అంతిమ దశకు చేరుకున్న నేపథ్యంలో మాదిగలు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అండగా ఉండాలన్నారు. మాదిగల రాజకీయ చైతన్యం కోసం ఈ నెల 26న బోయిగూడ ముదిరాజ్ సంఘంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొర్ర భిక్షపతి, శివకుమార్, ఆదిత్య, సుచ్చింద్ర, ప్రణయ్, మనోజ్, శ్రీను పాల్గొన్నారు.

దీవించమ్మా



సినీనటి సీతారామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఆదివారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెను ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. –అమీర్‌పేట

ఎస్సీఎస్టీబీసీ అధ్యక్షుడిగా సీతారామ్



సికింద్రాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ ఎస్టీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నందారం సీతారామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలో సమావేశమైన అసోసియేషన్ ప్రతినిధులు సీతారామ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్, ప్రసాద్, విద్యాసాగర్, శేషగిరిరావు, చలపతి, శివప్రసాద్ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌కు యత్నం

మహిళ రిమాండ్

లాలాపేట: ఓ బాలుడిని కిడ్నాప్ చేయడానికి యత్నించిన ఓ మహిళను రిమాండ్‌కు తరలించిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నేనావత్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ వనపర్తి బాలానగర్ ఫిరోజ్‌గూడకు చెందిన శాంతి (35) అనే మహిళ కల్లుకు బానిసై గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా వ్యవరిస్తుంది. ఓయూ క్యాంపస్ సమీపంలోని మాణికేశ్వర్‌నగర్‌లో శనివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న 6 ఏళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా ఓయూ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళలను రిమాండ్‌కు తరలించారు.

బస్తీ అభివృద్ధికి కృషిచేస్తా


స్టాలిన్ కృష్ణవేణిని అభినందిస్తున్న బస్తీ వాసులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట సాయినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ మహిళా ఇన్‌చార్జి స్టాలిన్ కృష్ణవేణి ఎన్నికయ్యారు. ఆదివారం సమావేశమై బస్తీ వాసులంతా ఆమెను అధ్యక్షురాలిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాయినగర్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ బస్తీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనను అధ్యక్షురాలిగా ఎన్నుకున్న సాయినగర్ వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజమల్లమ్మ, లక్ష్మమ్మ, దేవయ్య, పర్శరామ్, రమేష్, యాదగిరి, గొన్న చందు, శాఖ శ్రీను, అనీల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


ఊరేగింపులో పాల్గొన్న పాస్టర్లు, క్రైస్తవ సోదరులు


ర్యాలీలో ఏసు క్రీస్తు వేషధారణలతో..

అడ్డగుట్ట: ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం(పామ్ సండే) నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ కుమార్ ఆధ్వర్యంలో మట్టలను ప్రదర్శిస్తూ అడ్డగుట్ట, తుకారాంగేట్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువ సందేశాలను వివరిస్తూ, ఈ సంవత్సరంలో ప్రతీ కుటుంబం సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సీఎస్ఐ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో...

సౌత్ లాలాగూడలోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టల సండే కార్యక్రమాన్ని మోషే కోడూర్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం లాలాగూడ, న్యూ బ్రిడ్జ్ మీదుగా మెట్టుగూడ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ కాపరి జార్జ్ క్రిస్టోఫర్, తదితరులు పాల్గొన్నారు.

మెథడిస్ట్, సీఎస్ఐ చర్చీలలో..

అమీర్‌పేట: మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని సనత్‌నగర్ మెథడిస్ట్, సీఎస్ఐ చర్చీలలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మట్టలను చేత పట్టుకుని చర్చి పరిసరాల్లో భక్తి గీతాలను ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ప్రతి యేట ఈస్టర్ పండుగకు ముందుగా వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని పాస్టర్లు వివరించారు. దీనిని హోలీ వీక్ అని కూడా అంటారని, మరణానికి ముందు చివరిసారిగా ఎరుషలేములో యేసు క్రీస్తు సందర్శించిన సమయంలో జరిగిన సన్నివేశాలు, ప్రాముఖ్యతను గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు దీన్ని జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ఇన్‌చార్జి ఎం.విల్సన్, పాస్టర్ జయకర్, సెక్రటరీ కిరణ్, కమిటి సభ్యులు దేవి బాబురావు, మురళి, ఇమ్మానియేల్,సి. హెచ్.సుధీర్ కుమార్, సూర్యప్రకాష్, ప్రవీణ్, గ్రెగరీ, సిమోన్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని వివిధ చర్చిలలో మట్టల ఆదివారంను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆయా చర్చిల నుంచి ఈత మట్టలు చేత పట్టుకుని యేసు క్రీస్తు పాటలు పడుతూ, సందేశాన్ని పంచుతూ ర్యాలీలను నిర్వహించారు. సికింద్రాబాద్ సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చి, వెస్లీ చర్చిలకు చెందిన క్రైస్తవులు సికింద్రాబాద్‌లోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.


అడ్డగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సందడిగా హోలీ ఉత్సవాలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మారుతీవీధిలోని సంజనా ప్లే స్కూల్‌లో చిన్నారులు హోలీ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులందరు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటాపాటలతో అందరిని ఆకట్టుకున్నా రు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద మాట్లాడుతూ.. చిన్నారులు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల గురించి తెలుసుకునేందుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో దోహద పడుతాయన్నారు.

పద్మారావు ఇంటివద్ద సంబరాలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ టకారాబస్తీలోని బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్ ఇంటివద్దకు ఆదివారం పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్ తదితర నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన నాయకులు పద్మారావుగౌడ్‌ను అభినందించి మద్దతు ప్రకటించారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, రాజసుందర్, జలంధర్‌రెడ్డి, రాంచందర్, నారాయణ, కరాటే రాజు, సునీల్, వెంకటేష్, అనిల్ తదితరులు మద్దతు తెలిపారు.







సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379